

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం,25 డిశంబర్ 2025 | 8 పేజీలు


# స్వామివారి సాక్షిగా..
# ఏసీబీ పంజా




- 12 మంది వ్రత పురోహితులపై భక్తుడు ఫిర్యాదు
- అన్నవరం దేవస్థానంలో కలకలం- ఏసీబీ నిఘాలో 12 మంది వ్రత పురోహితులు
- అన్నవరం 'సత్య'దేవుని సాక్షిగా అపచారం: దానాల ముసుగులో రూ కోట్ల దందా!
- వందల ఏళ్ల నమ్మకాన్ని తాకట్టు పెడుతున్న 12 మంది పురోహితులు..
- భక్తుల భయమే వీరి పెట్టుబడి! - ఆధారాలతో ఏసీబీ గడప తొక్కిన ఓ భక్తుడు
- భక్తుడు చూపిన ఆధారాలు నమ్మితే ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. అరెస్టులు ఖాయం



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అన్నవరం రత్నగిరిపై 'అవినీతి' నీడలు కమ్ముకున్నాయి. స్వామివారి వ్రతం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయని నమ్మి వచ్చే భక్తుల అమాయకత్వాన్ని కొందరు పురోహితులు కాసుల వర్షంగా మార్చుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ సేవకులుగా ఉంటూ, భక్తులను భయభ్రాంతులకు గురిచేసి కోట్లాది రూపాయలు దండుకుంటున్న 12మంది ప్రధాన పురోహితులపై అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం (ఏసిబి )రేంజ్ అధికారులకు బుధవారం ఫిర్యాదు అందింది. వ్రత పురోహితుల అన్యాయంపై భక్తులను కోట్లలో నిలువ దోపిడీపై ఓ భక్తుడు సమర్పించిన ఈ ఫిర్యాదు ఇప్పుడు దేవస్థాన వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

**కుంభకోణంతీరుతెన్నులివే..**సాధారణంగా వ్రతం చేయించే పురోహితులకు దేవస్థానం టిక్కెట్టు ఆదాయంలో 40శాతంవాటాను వేతనంగా ఇస్తుంది. అయితే, ఇది చాలదన్నట్టు ఈ 12 మంది వ్రత పురోహితులు 1. మల్లాది గురుమూర్తి 2.మంథా శ్రీరామ్మూర్తి, 3. తొయ్యేటి హరినాథ సుబ్రహ్మణ్యం 4. మొక్కరాల సతీష్ 5. పాలంకి సోమేశ్వరరావు 6 ప్రయాగ ఆంజనేయులు 7.సవితాలవీరవెంకటరమణ 8.పెద్దింటి తేజస్వి9.పెండ్యాల వి.ఆర్.బి.కే. శర్మ 10.చామర్తి వెంకటరెడ్డి పంతులు 11.పొన్నపల్లి వెంకటశాస్త్రి 12.చామర్తి జగ్గారావు ఒక 'సిండికేట్'గా ఏర్పడి దానాల పేరుతో అక్రమ డబ్బు కోసం సమాంతర వ్యవస్థను నడుపుతున్నారు.

**నవగ్రహ భయం** : భక్తులకు జాతక దోషాలు ఉన్నాయని ఆ దోషాలు పోవాలంటే నవగ్రహ శాంతిబ్రాహ్మణులకు వస్త్రదానం,గోదానం, అన్నదానం చేయాలని అమాయక భక్తులను మభ్యపెట్టి భయభ్రాంతులకు గురిచేసి లక్షల్లో లూటీ చేస్తున్న మోసగాళ్లు.

**దానాల పేరిట దౌర్జన్యం:** శాస్త్రోక్తంగా ఇచ్చే దానాల పేరుతో ఒక్కో భక్తుని నుండి వేల రూపాయలు అదనంగా వసూలు చేయడం.

**నిబంధనల ధిక్కరణ:** అక్రమ వసూళ్లు ఆపాలని ఈ సంవత్సరం మార్చి 1వ తేదీన దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను (L.Dis.No: B1/COE-12024) వీరు బేఖాతరు చేస్తున్నారు.

- తరువాయి 2లో..

## శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

- జగతికి శాంతి సందేశమిచ్చిన మహానుభావుడు ఏసు ప్రభువు
- క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి/నిడదవోలు,మేజర్‌న్యూస్ :** క్రైస్తవ సోదరులకు మంత్రి కందుల దుర్గేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ,కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసు ప్రభువు ఆశించిన శాంతియుత సమాజ స్థాపనకు కృషిచేద్దామని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒకప్రకటనలో పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమపూర్వకమైన జీవన మార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసు ప్రభువు అన్నారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనేపదాలను ఉదహరిస్తూ దుష్టులను శిక్షించాలని, శిష్టులను రక్షించాలని అంటారు. కానీ తనను హింసించి శిలువ వేసిన దుష్టులను సైతం కాపాడమని చెప్పిన మహానుభావుడు ఏసుప్రభువు అని మంత్రి దుర్గేష్ అన్నారు. ప్రతి ఒక్కరూ

- తరువాయి 2లో..

## శ్రీ అగస్త్య పాఠశాలలో మిన్నంటిన క్రిస్మస్ సంబరాలు







### - సేవాగుణం, మానవత్వమే పరమార్థమని చాటిన విద్యార్థులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక శాంతినగర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ అగస్త్య పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక మరియు ఉత్సాహభరిత వాతావరణంలో బుధవారం జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక ల్లో విద్యార్థులుశాంటాక్లాస్ వేషధారణలో,రంగురంగుల దుస్తుల్లో సందడి చేస్తూ అందరినీ అలరించారు.

**సేవే మార్గం-శాంతియే లక్ష్యం:**ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) మాట్లాడుతూ క్రీస్తు చూపిన శాంతి, కరుణ, మరియు సేవామార్గం నేటితరానికి ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. "మతంఏదైనా, అది మానవత్వాన్ని నేర్పాలి.లోకహితం కోరే విద్యార్థులే రేపటి ఆదర్శ పౌరులుగా నిలుస్తారు"అనిఆయన ఆకాంక్షించారు.సాంస్కృతిక ప్రదర్శనలు:చిన్నారులు ప్రదర్శించిన 'క్రిస్మస్ క్యారల్స్' పాటలు, నృత్యాలు మరియు నాటికలు అలరించాయి. బెత్లెహేం దృశ్యాలను తలపించేలా విద్యార్థులుచేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అభినందనల జల్లు:వేడుకలను కంటికి పండువగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దొడ్డిపట్ల పల్లవి, ప్రిన్సిపాల్ వి.లక్ష్మి, సీనియర్ ప్రతినిధి అల్లుమల్లుఏలియా, వేడుకల నిర్వాహకులు ఏ.పావని, బి.సువర్ణ, పి.సంధ్యతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

- తరువాయి 2లో..

# స్వామివారి సాక్షిగా.. ఏసీబీ పంజా

**మొదటిపేజి తరువాయి**

చట్టం ఏంచెబుతోంది?ఫిర్యాదుదారుడైన భక్తుడు ఫిర్యాదులో ప్రధానంగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) మరియు అవినీతి నిరోధక చట్టం (పిసి యాక్ట్) కింద కీలక సెక్షన్లను ప్రస్తావించారు:

**-పిసి యాక్ట్ సెక్షన్ 7&13 :** ప్రభుత్వ వేతనం పొందుతూ భక్తుల నుండి లంచం/అదనపు డబ్బులు లబ్ధి పొందడం నేరపూరిత దుష్ప్రవర్తన.

**- బిఎన్ఎస్ సెక్షన్ 308 :** భయం పుట్టించి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం 'దౌర్జన్య వసూలు'.

**-బిఎన్ఎస్ సెక్షన్ 316 :** నమ్మకంతో పూజకు వచ్చిన భక్తుల విశ్వాసాన్ని వమ్ము చేయడం.

**అక్రమ ఆస్తులపై విచారణకు డిమాండ్!**

కేవలం అదనపు వసూళ్లు మాత్రమే కాకుండా,ఈ 12 మంది పురోహితులు గత ఐదేళ్ల కాలంలో సంపాదించిన ఆదాయం, వారి బినామీ ఆస్తులు, ఇందులో కీలక క్రిమినల్ మల్లాది గురుమూర్తి నూటికి పది రూపాయల వరకు సాగుతున్న వడ్డీ వ్యాపారం మరియు వారి విలాసవంతమైన జీవనశైలిపై 'ఆస్తులవెరిఫికేషన్' జరపాలని ఫిర్యాదు దారుడు కోరారు. వైదిక కమిటీ సభ్యుడు పురోహిత సంఘం అధ్యక్షుడు, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు చామర్తి వెంకట రెడ్డి పంతులు, మల్లాది గురుమూర్తి వంటి ప్రముఖులు ఈ జాబితాలో ఉండటం సంచలనంగా మారింది. ఈ సంవత్సరం కార్తీక మాసంలో దేవస్థానంలో ప్రతిరోజూ వేల సంఖ్యలో వ్రతాలు జరిగాయి. అయితే, ఈ వ్రతాల మధ్యలో ఈ 12 మంది వ్రత పురోహితులు మైకుల్లో బహిరంగంగా భక్తులను ఉద్దేశించి, "దానాలు చేస్తేనే వ్రత ఫలితాలు దక్కుతాయి" అని చెప్పడం జరిగింది. భక్తితో వచ్చే భక్తులను మానసికంగా ఇబ్బంది పెడుతూ, దానాల పేరుతో జరుగుతున్న ఈ దోపిడీ అత్యంత విచారకరం. దీనికి సంబంధించిన పూర్తి వీడియో ఫుటేజ్, ఆడియో రికార్డింగ్‌లు దేవస్థానంలోని సిసిటివి కెమెరాలలో భద్రంగా ఉన్నాయి. ఈ రికార్డింగ్‌లు సుమారు ఆరు నెలల వరకు అందుబాటులో ఉంటాయని తెలుస్తోంది. కావున, సంబంధిత అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి వెంటనే తగు చర్యల్లో భాగంగా దేవస్థానంలోనే ఉన్న వీడియో మరియు ఆడియో ఆధారాలను స్వాధీనం చేసుకోవాలి. నిర్లజ్జగా సాగిన భక్తుల దోపిడీకి మౌన సాక్ష్యాలుగా ఉన్న ఈ రికార్డింగ్‌లను పరిశీలించి, నిత్య కళ్యాణ మండపంలో జరిగిన "దాన దోపిడీకి "పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో భక్తుడు కోరాడు.

**ఉన్నతాధికారులపై రాజకీయ నాయకులు ఒత్తిడి**

సీఎంఓ ఆదేశాలు మేరకు కమీషనర్ అనుమతితోఈఓ వేంద్ర త్రినాధరావు వ్రత పురోహితులను సస్పెండ్ చేసిన 24గంటలు కాకుండా అప్పుడే రాజకీయ నేతలతో అధికారులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. భక్తుల నుంచి దండిన కోట్ల నుంచి లక్షలు లంచాలుగా అధికారులకు ఇవ్వడానికి రెడీ అవుతున్నట్లు ప్రచారంలో ఉంది. దేవాదాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ ఏసీబీ కేసు , కార్తీక మాసంలో చేసిన దానాల దోపిడీ రీఎంక్వైరీ పూర్తయ్యి నిగ్గు తేల్చేంతవరకు వీరిని విధుల్లోకి తీసుకోకూడదని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. "దేవుని సన్నిధిలో దొంగతనం చేయడం కంటే, భక్తుల భక్తిని దోచుకోవడం పెద్ద నేరం. ఆడియో వీడియో ఆధారాలతో సహా అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాం.. ఏసీబీ కీలక అధికారులు లోతైన విచారణ జరిపితే అన్నవరం కొండపై ఉన్న అవినీతి తిమింగలాలు బయటపడతాయి భక్తులు ఆనందపడతారు." – ఫిర్యాదు చేసిన భక్తుడి ఆవేదన.

**రంగంలోకి కీలక సాక్ష్యాలు:**

ఫిర్యాదుతో పాటు వ్రత పురోహితుల బండారాన్ని బయటపెట్టే పెన్ డ్రైవ్ (ఆడియో/వీడియో క్లిప్పింగ్స్), దేవాదాయ శాఖ నిర్వహించిన అంతర్గత విచారణ నివేదికలను, గతంలో కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్‌లు, ఈ నెల 22న దానాల దోపిడీకి కారణమైన వారిని సస్పెండ్ చేయమని కమీషనర్ ఇచ్చిన ఆదేశాలు అవినీతి శాఖ అధికారులకు అందజేశారు. ఇప్పుడు ఏసీబీ అధికారులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి దాడులు నిర్వహిస్తే, అన్నవరం క్షేత్రానికి పట్టిన ఈ అవినీతి పీడ విముక్తయ్యే అవకాశం ఉంది.

**ఏసీబీ ప్రాథమిక విచారణ ...** ఫిర్యాదుదారుడు సమర్పించిన పెన్ డ్రైవ్ (ఆడియో/వీడియో క్లిప్పింగ్స్), గత ఈవో యువ సుబ్బారావు కలెక్టర్‌కి ఇచ్చిన నివేదిక, ఈ సంవత్సరం మార్చి ఒకటిన కమిషనర్ ఆదేశాలు, ఈనెల 22న కమీషనర్ ఆదేశాలు, జాతీయ సంచలన తెలుగు దినపత్రిక సూర్యలో వచ్చిన సంచలన కథనాలు, దేవస్థానంలో అందుబాటులో ఉన్న సిసి ఫుటేజ్, ఆడియో వాయిస్ రికార్డర్లు పరిశీలించి, ప్రాథమికంగా నిజమని నిర్ధారణకు వచ్చిన ఏసీబీ కేసు నమోదు చేయాలి.

**ఎఫ్ఐఆర్ నమోదు..** అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7 వ్రత పురోహితులు దానాల పేరుతో డబ్బు అదే లంచం అడగడం, సెక్షన్ 13 నేరపూరిత దుష్ప్రవర్తన కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.

**అక్రమ ఆస్తుల వెరిఫికేషన్...** ఫిర్యాదులో కోరినట్లుగా, సదరు 12 మంది వ్రత పురోహితుల ఆదాయ మార్గాలు, గత 5 ఏళ్లలో పెరిగిన ఆస్తులు, వారి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న బినామీ ఆస్తులపై ఆదాయానికి మించిన ఆస్తుల (డిఎ కేసు) విచారణ చేపట్టాలి.

వడ్డీ వ్యాపారంపై విచారణ : దేవస్థాన నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు ఆధారాలు ఉంటే, స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని ఆ కోణంలో కూడా విచారణ జరపాలి. భక్తుడు ఫిర్యాదు ప్రకారం అన్ని ఆధారాలు ఉంటే ఈ రకంగా అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రాథమిక వికారణ చేపట్టి నిందితులను చట్ట ప్రకారంగా శిక్షిస్తారు.

## అగాపే ఆశిబాబు వితరణతో బాలునికి వీల్ చైర్ అందజేత

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** స్థానిక సూరపురాజు కాలనీలో ఆగాపే స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో వ్యవస్థాపకులు బిరుదుగడ్ల ఆశిబాబు వ్యక్తిగత వితరణతో బుట్టాయిగూడెం మండలం పులిరామన్నగూడెం గ్రామానికి చెందిన మాడి శ్రీను,శిరీష దంపతుల కుమారుడు 7 సంవత్సరాల వయసుగల శ్రీనితకు బుధవారం వీల్ చైర్ అందజేశారు. ఆగాపే విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యక్రమంలో ఆశిబాబు మాట్లాడుతూ పులిరామన్న గూడెంకు చెందిన శ్రీనిత విభిన్న ప్రతిభావంతునిగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి సోకడం ద్వారా కుమారుని తల్లి శిరీష వీల్ చైర్ అవసరమని శ్రీనివాసపురం జడ్పీ హైస్కూల్ తెలుగు పండిట్ బిరుదు గడ్ల నాగేశ్వరరావు దృష్టికి తీసుకురాగా వారి ద్వారా ఈ విషయం తెలుసుకొని ఆ బాలుడు శ్రీనితకు వీల్ చైర్ అందజేశామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీకే ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గణిత ఆనంద్ ప్రసాద్, సంఘ సేవకులు కేఎల్ఎన్ ధన కుమార్, శ్రీనివాసపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎరిపే గంగాదేవి మాట్లాడుతూ ఆశి బాబు విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న సహాయ సహకారాలు ఎంతో అమూల్యమైనవని ఈ కార్యక్రమాల నిర్వహణలో ఆశి బాబు మాత ృమూర్తి కాంతమ్మ అందిస్తున్న సహాయాన్ని కొనియాడారు. బిరుదుగడ్ల నాగేశ్వరరావుకు శ్రీనిత తల్లి శిరీష, వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## బార్ కౌన్సిల్ సభ్యులు 'చలసాని'కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



**ఏలూరు,మేజర్న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌కు 2026 ఫిబ్రవరిలో జరుగుతున్న ఎన్నికలలో ప్రస్తుత బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ తమ అభ్యర్థిత్వాన్ని బలపరిచి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా మంగళవారం ఏలూరు జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి న్యాయవాదికి భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ముద్రించిన నూతన చట్టాలకు సంబంధించిన పుస్తకము, క్యాలెండర్ ను అజయ్ కుమార్ అందజేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామరావు, హైకోర్టు న్యాయవాది చలసాని వెంకయ్య,ఐ ఏ ఎల్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రంగారావు,ఐఏ ఎల్ ఏలూరు జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, పి పి శాస్త్రి, న్యాయవాదులు జిల్లెలమూడి ప్రసాద్, తదితర న్యాయవాదులు అజయ్ కుమార్‌తో పాటు ప్రసార కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం ఏలూరు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఐఏఎల్ ముద్రించిన 2026 డైరీ న్యాయవాదుల సమక్షంలో చలసాని అజయ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే సీతారామరావు తదితరులు ఆవిష్కరించారు.

## శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

**మొదటిపేజి తరువాయి**

స్వార్థాన్ని వీడితేనేసమసమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తోందన్నారు. ఈసందర్భం గా ప్రజలం దరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ అగస్త్య పాఠశాలలో మిన్నంటిన క్రిస్మస్ సంబరాలు

**మొదటిపేజి తరువాయి**

తల్లిదండ్రులకు ప్రత్యేక సందేశం.."శ్రీ అగస్త్య పాఠశాల కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా, పిల్లల్లో నైతిక విలువలు, సర్వమత సామరస్యం మరియు సేవాభావాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తోంది. మీ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాము. మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు 'శ్రీ అగస్త్య' యాజమాన్యం మరియు సిబ్బంది తరపున క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు!".

## జంగారెడ్డిగూడెం పోలీసుల వినూత్న తనిఖీలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** నేర నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలో అమలులో భాగంగా జంగా రెడ్డిగూడెం పట్టణంలో బుధవారం పోలీసులు వినుత్న తనిఖీలు చేపట్టారు. స్థానిక ఏ ఎస్ పి సుస్మిత ఆర్ ఆదేశాల మేరకు పట్టణ ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్, ఎస్ఐ వీర ప్రసాద్,సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులను పోలీసులు గుర్తించారు. కేవలం జరిమానాలు విధించి వదిలివేయకుండా నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తూ వాహనదారులతో అక్కడికక్కడే వారి వాహనాలను నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు. పోలీసుల వినూత్న చర్యల పట్ల పట్టణ ప్రజల నుండి ప్రశాంశలు వ్యక్తం అవుతున్నాయి.

ఇది ఎలా ఉండగా నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే వాహన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఇన్స్పెక్టర్ సుభాష్ వాహనదారులను హెచ్చరించారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను నేరస్తులు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాలకి స్పష్టమైన నెంబర్ ప్లేటు ఉండటం తప్పనిసరి అని ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్ స్పష్టం చేశారు.

## జంగారెడ్డిగూడెం రూరల్ టిడిపి నూతన కార్యవర్గం

**జంగారెడ్డిగూడెం ,మేజర్ న్యూస్ :** టిడిపి జంగారెడ్డిగూడెం రూరల్ మండలానికి నూతన కమిటీని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఇటీవల ప్రకటించారు. మండల టిడిపి అధ్యక్షుడిగా కుక్కల మాధవరావు, ఉపాధ్యక్షులుగా గొల్లమందల శ్రీనివాసు,ప్రధాన కార్యదర్శిగా బూసా సత్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహన కార్యదర్శులుగా ముమ్మడి రాజేంద్ర,పులపాకుల ప్రసాద్,జోడాల శేఖర్,సహాయ కార్యదర్శులుగా పిచ్చుకల మునేశ్వరరావు,షేక్ సిలార్ బి, ఘంటా రామారావు,కోశాధికారి కనిగొల్ల నరసింహారావును నియమించి నట్లు మండల ప్రెసిడెంట్ కుక్కల మాధవరావు బుధవారం మేజర్ న్యూస్ ప్రతినిధికి తెలిపారు.

## వినియోగదారులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**జంగారెడ్డిగూడెం ,మేజర్న్యూస్ :** ప్రస్తుతం డిజిటల్ యుగంలో అనేకరూపాల్లో మోసాలకు గురవు తున్నారని,వినియో గదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం అత్యవసరం అని మండలం వినియోగదారులు కౌన్సిల్ అధ్యక్షులు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు కుక్కునూరి రామ చంద్రరావు అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలు సందర్భంగా స్థానిక మండల వినియోగదారుల కౌన్సిల్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ నందు కాలేజీ ప్రిన్సిపల్ సూర్య కుమారి అధ్యక్షతన వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు జరిగింది.

కౌన్సిల్ అధ్యక్షులు రామచందర్రావు తన ప్రసంగంతో నకిలీ ఉత్తర్వులు, మోసపూరిత ప్రకటనలు,నాణ్యత లేని సేవల కారణంగా వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారువినియోగదారుల కౌన్సిల్ ఉపాధ్యక్షులు ఆర్.భాస్కర్‌రావు, కార్యదర్శి షేక్ హీరా హకీమ్, మండల సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వరరావు, కామర్స్ విభాగం అధినేత జి.నవీన్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు బాధ్యతలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పిసిహెచ్ రాంబాబు,వి.రాంబాబు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో యోగాపై అవగాహన సదస్సు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అనుబంధ సంస్థ ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి.బ్యూలా తెలియజేశారు.ముఖ్య అతిథులుగా దివ్య బాబాజి సుషుమ్న క్రియ యోగా ఫౌండేషన్ వారు డాక్టర్ శృతి కీర్తి, మరియు కళావతి మేడం ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥బి.ఈ.వి.ఎల్.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్య పాల్గొన్నారు.డా॥ శృతి కీర్తి మాట్లాడుతూ యోగ అంటే కేవలం ఆసనాలే కాదని మనసుకి మరియు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే విధంగా 108 రకాలుగా ఉన్నాయని, మానవుని మెదడు రెండు భాగాలుగా విభజించబడిందని ఒకటి స్పృహ, రెండు అచేతన స్పృహ అని అచేతన మెదడులో మన అనవసరమైన మాటలను రోజుకి 60 వేలు ఆలోచనలను తీసుకుంటుందని, అంతకన్నా ఎక్కువ ఉండకూడదని, అంతకన్నా ఎక్కువగా ఉంటే మానవుని మానసిక ఆరోగ్యానికి భంగం కలుగుతుందన్నారు. ముందుగా నిటారుగా కూర్చొని జ్ఞానముద్రను పెట్టి కళ్ళు మూసుకుని మకారాన్ని 21సార్లు పలికి, ఈ మకారాన్ని పలకడం వల్ల నాభి నుంచి తలవరకు కదలిక జరిగి మనసుకు ప్రశాంతతను కలుగచేస్తుందని తర్వాత శ్వాస తీసుకోవడం శ్వాస విడిచిపెట్టడం ఇలా 14 సార్లు చేయాలన్నారు. శ్వాస తీసుకునే సమయంలో మంచి ఆలోచనలు తలుచుకోవాలి అని శ్వాస విడిచి పెట్టేటప్పుడు చెడు ఆలోచనలు విడిచిపెట్టాలని, మన నుదుటి మధ్య భాగంలో ఏకాగ్రత నుంచి ఎటువంటి ఆలోచనలు రాకుండా మెదడును ప్రశాంతంగా ఉంచి తరువాత అరచేతులను బుద్ధి కళ్ళు భాగంపై పెట్టి ఆ కళ్ళతో అరచేతులను చూడాలని ఈ విధానముగా రోజుకు పదిహేను నిమిషాల పాటు 49 రోజులు పాటిస్తే మనకు ప్రాణాయుమ ప్రక్రియ ద్వారా ఆక్సిజన్‌ను శరీరంలో నింపుట ద్వారా శారీరక మరియు అనేక రుగ్మతలను నయం చేసుకోవచ్చు అని, మానసిక ఆరోగ్యం, ప్రశాంతత కలుగుతుందని విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టడానికి బాగా ఉపయోగపడుతుందని తెలియజేశారు.

కళాశాల ప్రిన్సిపల్ డి.బ్యూలా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా మార్గాన్ని అనుసరించి ఆరోగ్యంగా తయారయ్యే ఆరోగ్య భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఇటువంటి యోగా అవగాహన సదస్సులు కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. యోగాపై అవగాహన సదస్సులో విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు, బి.వి.రమణ, యు.ఎల్. ఎన్.కుమార్, రాణా ప్రతాప్ సింహ, హరిణి పాల్గొన్నారు.

# కె.ఎల్.సి. బ్యాంకు ప్రారంభోత్సవం



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** కొంకాపల్లిలో నూతనంగా ప్రారంభమైన మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేట్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకుకు ముఖ్యఅతిథిగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ కందుల చందు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ప్రజలందరూ లోన్స్ ఇచ్చుకుంటూ ప్రతి కస్టమర్‌కి బ్యాంకు ద్వారా బెనిఫిట్స్ పొందే విధంగా కొన్ని స్కీమ్స్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బ్యాంకులో గోల్డ్ లోన్స్, ఫిక్స్ డిపాజిట్,ఆర్ డి, మరియు ఇన్సురెన్సులు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి పబ్లిక్ కి సర్వ్ చేసుకుంటామని తెలిపారు. అదే విధంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా కొన్ని తాటిపాక, రాజోలు, మలికిపురం, రామచంద్రపురం, మండపేట, రావులపాలెం ప్రాంతాల్లో బ్రాంచ్లు కూడా ఏర్పాటు చేయబోతున్నామని అలాగే రానున్న రోజుల్లో మా సేవలు ఈ ప్రాంతాల్లో విస్తరింపజేసి అందరు సహాయ సహకారాలతో మా వ్యాపారాన్ని అభివృద్ధిని ఆశీర్వదించి మా సేవలు పొందాలని చైర్మన్ కందుల చందు తెలిపారు.ఈ ప్రారంభోత్సవంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, డీసీఎంఎస్ చైర్మన్ పిచ్చిడి చంద్రమౌళి, తెలుగుదేశం నాయకులు బొర్రా ఈశ్వరరావు, జనసేన నాయకులు మొయిల శివ, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదరీసోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

## – ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



**కాకినాడ మేజర్ న్యూస్ :** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్రైస్తవ సోదరీసోదరులకు మరియు నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. లోక రక్షకుడు, శాంతి దూత అయిన ఏసుక్రీస్తు జన్మించిన ఈ రోజున క్రైస్తవ కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సర్వ మానవాళికి ప్రేమ, కరుణ, సహనం అనే గొప్ప సందేశాన్ని అందించిన క్రీస్తు మార్గం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని, అందరికీ మంచి జరగాలని ఆయన కోరుకున్నారు.పండుగను భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ద్వారంపూడి పిలుపునిచ్చారు.

# వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు

## – అన్నదాన పథకానికి విరాళం





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలవాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ధనుర్మాసం తొమ్మిదివ రోజు బుధవారం శ్రీవారికి అభిషేక నిమిత్తమై గౌతమీనది నదీ జల సేకరణ వివిధ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణమంతా అష్టోత్తర పూజలు, కళ్యాణం జరిపించుకునే భక్తులతో పోటెత్తింది.

నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి, గాంధీపురంకు చెందిన ఇవటూరి పవన్ కుమార్, ఫణి కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,050లు విరాళంగా అందించారు.

వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సూపర్డెంట్ రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# సర్ సి.వి.రామన్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు



**అమలాపురం మేజర్‌న్యూస్ :** సర్ సి.వి.రామన్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో యేసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ఆయన యొక్క సందేశాలను, ఆయన యొక్క మహిమలను విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ ఆర్.వేణు గోపాలరావు, ప్రిన్సిపాల్ బి.కేశవరావు, హెచ్ఎం జి.రాజా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తెలియజేశారు.

ఆయన లోకానికి ఇచ్చిన మంచి మాటలను, వారు చూపిన మార్గాన్ని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు.

# సంక్రాంతి సంబరాలకు ముమ్మర ఏర్పాట్లు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం లాకుల సమీపంలో సంక్రాంతి సంబరాలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. సర్ అర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఆత్రేయపురం లాకులు సమీపంలో ప్రతి ఏటా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా బొబ్బలంక ప్రధాన కాలువలో పడవల పోటీలు రంగవల్లులు, ఇతర సాంస్కృతి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వము స్థానికుల భాగస్వామ్యంతో నిర్వహిస్తుంది. ఆ ఏర్పాట్లను బుధవారం మండల టిడిపి అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్, ఇన్చార్జి తాసిల్దార్ రామచంద్రమూర్తి, కమిటీ సభ్యులు వెచ్చా అనిల్, జుజవరపు హరిబాబు, తోట రజిని, ముదునూరి గణపతిరాజు, మజ్జి తరుణ్, భావన శీను తదితరులు పరిశీలించారు. నిర్వాహకులకు ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# 'ఆదిత్య'లో క్రిస్మస్ సెలబ్రేషన్స్



కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో రంగ్‌మంచ్ సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయని కళాశాల పిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ & పి.జి కళాశాల సెక్రటరీ డా॥ నల్లమిల్లి సుగుణ రెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు అడుగుజాడలు శాంతిమార్గాలనీ, ఆయన అంతర్జాతీయ మానవీయతకు నిలయమనీ, క్రీస్తు సందేశాలు ఆదర్శప్రాయాలని, నిత్య స్మరణీయాలని అని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్. నాయుడు మాట్లాడుతూ క్రైస్తవులు క్రిస్టమస్ పండుగకు ముందుగానే చక్కగా చర్చిలను, గృహాలను రంగురంగుల విద్యుద్దీపాలతో, పశువులపాకలతో క్రిస్టమస్ ట్రీని అందంగా అలంకరిస్తారు. ఈ పండుగలో క్రిస్టమస్ తాత ముఖ్యమైన ఆకర్షణగా కనిపిస్తారు అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ మాట్లాడుతూ అందరూ కొత్త బట్టలు ధరించి చర్చిలలో గంటలు మోగించి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారు. క్రొవ్వొత్తులను వెలిగిస్తారు. చర్చిలో ఫాదర్లు సందేశాలను ప్రశంగిస్తారు. ఒకరికొకరు క్రిస్టమస్ గ్రీటింగ్స్ తెలుపుకుంటారు. ఈ పండుగకు బంధుమిత్రులను ఆహ్వానించి విందు వినోదాలతో, కేకులను కోసి ఆనందంతో చప్పట్లతో ఎంతో ఆనందంగా గడుపుతారు. స్నేహితులకు, పిల్లలకు క్రిస్టమస్ బహుమతులు పంచిపెడతారు అని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్ మాట్లాడుతూ క్రిస్తు జన్మదినోత్సవమే క్రిస్మస్ పండుగ అని తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాలలో రంగ్‌మంచ్ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా క్రిస్మస్ పండుగ సంబంధించి విద్యార్థునులకు పెయింటింగ్, గ్రీటింగ్ కార్డు మేకింగ్, బృంద గానాలు, నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో రంగ్‌మంచ్ సాంస్కృతిక నిర్వాహకులు, సి.హెచ్. దివ్య భారతి, ఎస్.మరియమ్ రిజ్వానా, విద్యా వాలంటీర్లు, చిత్ర, మాన్య, సంధ్య, గౌతమిని మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్



**2026 ఫిబ్రవరి 15,16,17,18,19 తారీకుల్లో నిర్వహణ**

అమలాపురం,మేజర్‌న్యూస్ : ఉప్పలగుప్తం మండలం, గొల్లవిల్లిలో ఎఎస్ఆర్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 15,16,17,18,19 తారీకుల్లో ఆల్ ఇండియామెన్ ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతాయని నిర్వాహకులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామి నాయుడు, పెచ్చటి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, ఇసుక పట్ల రఘుబాబు, మండల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పిఎసిఎస్ చైర్మన్‌లు మరియు మండలంలో ఇతర పెద్దలందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ టోర్నమెంట్ ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్లో మొట్టమొదటి స్థానంలో ఉందని, ఇటువంటి టోర్నమెంట్ చేయడం గొల్లవెల్లి గ్రామానికి మరియు ఉప్పలగుప్తం మండలానికి చాలా అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు గందంపల్లంరాజు, అధికారి జయ వెంకట లక్ష్మి, అల్లాడ సోంబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, పెచిట్టి విజయలక్ష్మి, మట్టా మహాలక్ష్మి, ప్రభాకర్, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతుల నవీన్‌కు శుభాకాంక్షల వెల్లువ

## - మర్యాదపూర్వకంగా కలిసిన నులుకుర్తి

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన జ్యోతుల నవీన్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీపై ఆయనకున్న పట్టు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆయన చూపుతున్న చొరవను గుర్తించి అధిష్టానం మరోసారి నవీన్‌పై నమ్మకం ఉంచడంతో నియోజకవర్గాల్లోని కీలక నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలుపుతున్నారు. బుధవారం కాకినాడలోని శశికాంత్ నగర్ నివాసంలో జ్యోతుల నవీన్‌ను కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో జ్యోతుల కుటుంబానికి ఉన్న ప్రాముఖ్యతను, పార్టీ అభివృద్ధికి నవీన్ చేస్తున్న కృషిని నులుకుర్తి కొనియాడారు. నవీన్ నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాలని ఈ సందర్భంగా నులుకుర్తి ఆకాంక్షించారు. రాబోయే



రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో నవీన్ దిశానిర్దేశం కార్యకర్తలకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని వారు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో నులుకుర్తితో పాటు మేకా లక్ష్మణరావు, బూరిగ ఆశీర్వాదం, రాందేవ్ సీతయ్య దొర, కొండా వినాయక్, దమ్ము నూకరాజు తదితర నేతలు పాల్గొని నవీన్‌కు తమ మద్దతును, అభినందనలను తెలియజేశారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు




అమలాపురం,మేజర్‌న్యూస్: ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని అమలాపురం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో బుధవారం అత్యంత ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నంద్యాల మనువిహార్ ఆధ్వర్యంలో ఈ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఏసుప్రభు యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ భక్తి శ్రద్ధలతో ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల నాట్య ప్రదర్శనలతో ఆద్యంతం సంబరాలు అంబరాన్ని అంటాయి. పసువుల పాక, క్రిస్టమస్ ట్రీ ఎంతో అందంగా అలంకరించారు. అనంతరం విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నంద్యాల నాయుడు ప్రతీ ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ స్నేహప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవస్వామి నిత్య అన్నదాన పథకానికి విరాళాలు



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి నిత్య అన్నదాన పథకానికి బుధవారం ఆత్రేయపురంకు చెందిన అద్దేపల్లి వెంకటేశ్వరరావు, మాణిక్యాంబ దంపతులు రూ. 10,116లు; మచిలీపట్నంకు చెందిన సాదు మాల్యాద్రి జ్ఞాం కార్థం వారి భార్య రాధిక స్వామివారిని దర్శించుకుని రూ. 5,116లు విరాళంగా అందించారు. దాతలకు అర్చకులు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. వీరికి చైర్మన్ మెర్ల వెంకటేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## బొబ్బర్లంక వద్దిపర్రు రహదారి మరమ్మతుల కోసం రూ 70లక్షల మంజూరు

**- రహదారి విస్తరణ పనుల కోసం రూ.35 కోట్లతో ప్రతిపాదనలు**
**- మెర్లపాలెం నుంచి లొల్ల వరకు నూతన రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు**
**- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : మండలంలోని బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి విస్తరణ పనుల కోసం ఇప్పటికే రూ. 35 కోట్లు ప్రతిపాదనలు పంపడం జరిగిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి ప్రస్తుత మరమ్మత్తు పనుల నిమిత్తం రూ. 70 లక్షలు ఆర్‌అండ్‌బి నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలియజేశారు. మెర్లపాలెం నుంచి లొల్ల వరకూ నూతన రహదారి నిర్మాణం కొరకు రూ. 3కోట్లు ఆర్‌అండ్‌బి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణాలు ప్రారంభిస్తామని తెలిపారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ఏజెన్సీలో ఘోర రోడ్డు ప్రమాదం





**– ఇరువురు పంచాయతీ కార్యదర్శుల దుర్మరణం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవు కావడంతో ఏజెన్సీ ప్రాంతంలో విధులు ముగించుకొని స్వగ్రామాలకు మోటార్ బైక్‌పై వెళుతున్న ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడడం పలువురిని కలిచివేసింది.

చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి, పెద్ద సీతనపల్లి పంచాయతీ కార్యదర్శులు గద్దం సందీప్, పెయ్యల విద్యాసాగర్ బుధవారం సాయంత్రం మోటార్ బైక్‌పై వారి స్వగ్రామాలకు వెళ్తుండగా రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామ సమీపంలోని పాలకాలవ వద్ద ఆగి ఉన్న కారును వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కారు, మోటార్ బైక్ తీవ్రంగా ధ్వంసం అయ్యాయి. సంఘటనా స్థలం నుండి వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తుండగా రంపచోడవరం ప్రభుత్వాసుపత్రిలో ఒకరు, రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతులు ఇరువురిది కోనసీమ జిల్లా రాజోలు, పల్లంకుర్రు ప్రాంతాలకు చెందిన వారిని తెలిసింది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. రంపచోడవరం పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పూత దశలో జాగ్రత్తలపై రైతులకు అవగాహన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో జీడి మామిడి తోటలు పూత దశలో ఉన్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఎ.దేవదానం పేర్కొన్నారు. బుధవారం ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి ఎ.దేవదానం గంగవరం మండలం మర్రిపాలెం, పిండి కొండ గ్రామాలలో జీడి మామిడి తోటల రైతులు పూత దశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పూత దశలో ఉన్న జీడి మామిడి తోటలకు పూత నిలబడి ఎక్కువ కాపు వచ్చే విధంగా కొన్ని జాగ్రత్తలు రైతులు తీసుకోవాలన్నారు. అధిక దిగుబడి జీడి మామిడి తోటలు నుండి రావాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీడిమామిడి తోటలు గురించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి, రైతులు, సబ్ అసిస్టెంట్ శోభన్ బాబు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్స్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ విజేతలు



**అమలాపురం, మేజర్ న్యూస్** వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏ.వేమవరం గ్రామంలో విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్ ఆధ్వర్యంలో 21, 22, 23 తేదీలలో వైఎస్ జగన్స్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు హోరాహోరీగా పోటీ పడగా విజేతగా వైజాగ్ టీం గెలుపొందింది. రెండవ స్థానంలో మాగం టీం నిలిచింది. గెలుపొందిన వైజాగ్ టీంకు కుంచే రమణారావు చేతుల మీదుగా మొదటి బహుమతిగా 25 వేల రూపాయల చెక్కు, ట్రోఫీ బహుకరించారు. రెండవ బహుమతి మాజీ ఎంపి చింత అనురాధ 15 వేల రూపాయల చెక్కు, ట్రోఫీను అందజేశారు. పోటీలో పాల్గొన్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్‌ను నాయకులు, గ్రామ పెద్దలు అందరు చేతుల మీదుగా చిరు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు తోరం గౌతమ్, నక్క చంద్రశేఖర్, వంటేద్దు వెంకనాయుడు, కుడిపూడి భరతభూషణ్, చీకట్లకిషోర్, చెట్ల రామారావు, చిత్రపు జయరాజు, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, అత్యధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## అలరించిన ప్రసాద్ నృత్య ప్రదర్శన



**సామర్లకోట మేజర్ న్యూస్ :** మహారాష్ట్ర ప్రముఖ పుణ్య క్షేత్రం షిరిడీ శ్రీ సాయి బాబా వారి ఆలయంలో ఇటీవల సామర్లకోటకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు అలమండ ప్రసాద్ చేసిన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. హైదరాబాద్ శ్రీ నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ, భద్రాద్రి సంస్కృతి వారధి భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో షిరిడీ సాయి ఆలయంలో నృత్య కారుడు ప్రసాద్ కూచిపూడి , భరత నాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నృత్య కారుడు ప్రసాద్ ను ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సచిన్ దివాకర్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం ఇచ్చిన నృత్య గురువులు చల్లా కొండలరావు, తులసి, షిర్డీ సాయి ఆలయ బోర్డు మెంబర్ సచిన్ దివాకర్ కు నృత్య కారుడు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన నృత్య కారుడు ప్రసాద్ ను పలువురు అభినందించారు.

## మాధురి స్కూల్ నందు అంబరాన్నంటిన క్రిస్మస్ వేడుకలు





**శంఖవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని కత్తిపూడి గ్రామంలో గల మాధురి విద్యాలయ నందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి స్కూల్ చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు సందేశం ఇస్తూ జీసస్ బోధనలు అనసరనీయ మైనవి అని, యేసు క్రీస్తు పుట్టిన తర్వాత ప్రపంచము క్రీస్తు శకముగా ముందు వెనుకగా నిర్ణయించడం ఎంతటి గొప్పవాడో, ఆయన మహత్యము, ఆయన ఈ లోకములో మానవులను ప్రేమించి అనేక స్వస్థతలు కలిగి చేసిన రీతి, ఆయన పుట్టుక విధానం అలా ఎందుకు జరిగిందో వివరించిన రీతి అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించిన క్రిస్మస్ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకర్షితులు గావించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అడపా ఆదినారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మరిడమ్మ హుండీ ఆదాయం రూ.7.73 లక్షలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు బుధవారం దేవస్థాన చైర్మన్ చింతపల్లి శ్రీహర్ష, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీల ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపు ద్వారా దేవస్థానానికి 125 రోజులకు గాను హుండీల ద్వారా రూ.7,12,966/-లు అన్నదాన హుండీల ద్వారా రూ.60,734/-, మొత్తం రూ.7,73,700/- ఆదాయం సమకూరిందని, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, భక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘పీసా‘తో గిరిజనాభివృద్ధిపై స్వీయ నిర్ణయాలు



**– అక్షర మాలలో ‘పీసా’**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పంచాయతీ ఎక్సటన్షన్ టు షెడ్యూల్ ఏరియా యాక్ట్ (పీసా చట్టం) అమలులోకి వచ్చి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటిడిఏ పరిధిలోని బి.వెలమలకోట గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం శ్రామికులు ‘పీసా’ అక్షరమాలలో శుభాకాంక్షలు తెలిపారు. రంపచోడవరం డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ సారథ్యంలో జరిగిన ‘పీసా’ అక్షరమాల కార్యక్రమానికి ఉపాధి శ్రామికుల నుంచి విశేష స్పందన రాగా, 1996 సంవత్సరంలో ఏర్పడిన పీసా చట్టం ద్వారా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో స్థానిక సుపరిపాలనకు, గిరిజన ప్రాంతం అభివృద్ధిపై స్వీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ఆదివాసీలకు ఉంటుందని ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. అనంతరం ఉపాధిహామీ పథకం పనులు పరిశీలించి, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ‘జీ రామ్ జీ’ విధానాన్ని వివరించి గ్రామీణ శ్రామికులతో ముచ్చటించారు.

# ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

- డిజిటల్ న్యాయ పాలన ద్వారా వినియోగదారులకు సమర్థ, సత్వర పరిష్కారం
- లావాదేవీల్లో హక్కులు తెలుసుకుని వినియోగదారులు బాధ్యతతో వ్యవహరించాలి
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినియోగదారుల అవగాహన స్టాల్స్
- ముఖ్యఅతిథిగా ఇంచార్జి కలెక్టర్ వై. మేఘా స్వరూప్



**పెరవలి, మేజర్ న్యూస్ :** వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ న్యాయ పాలన ద్వారా వినియోగ దారులకు సత్వర న్యాయం సాధ్యమవుతోందని తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి జిల్లా కలెక్టర్ / జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అన్నారు. డిసెంబర్ 24వ తేదీ బుధవారం రాజమహేంద్రవరం దానవాయిపేటలోని ఎస్కేవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవం - 2025 కార్యక్రమాన్ని ఇతర అధికారులతో, జిల్లా నలుమూలల నుండి వచ్చిన వినియోగదారుల ఫోరం సభ్యులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేఘా స్వరూప్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాలనే ఉద్దేశంతో 1986 డిసెంబర్ 24న వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని, కాలానుగుణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2019లో సవరించిన చట్టం ద్వారా ఈ-కామర్స్ లావాదేవీలను కూడా చట్ట పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీని వల్ల ఆన్లైన్ కొనుగోళ్లలో వినియోగ దారులకు మరింత రక్షణ లభిస్తోందన్నారు. 2025 సంవత్సరానికి గాను జాతీయ వినియోగదారుల దినోత్సవ ఇతివృత్తంగా నిర్ణయించిన "డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం" నేటి పరిస్థితులకు పూర్తిగా అనుగుణమైనదిగా ఉందని పేర్కొన్నారు. డిజిటల్ న్యాయ పాలన ద్వారా కేసుల నమోదు నుంచి విచారణ, ఆదేశాల జారీ వరకు మొత్తం న్యాయ ప్రక్రియను సాంకేతికత ఆధారంగా నిర్వహించడం వల్ల వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకతతో కూడిన న్యాయం అందుతోందని తెలిపారు. ఈ - కోర్ట్స్, ఆన్‌లైన్ ఫైలింగ్, వర్చువల్ విచార ణల ద్వారా వినియోగదారులు ఇంటి నుంచే కేసుల వివరాలు తెలుసుకునే సౌకర్యం పొందుతున్నారని చెప్పారు. తద్వారా సమయం ఆదా కావడంతో పాటు పరిష్కారాలు త్వరితగతిన లభిస్తున్నాయన్నారు. వినియోగదారులు కేవలం హక్కులు కలిగినవారే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన శక్తి అని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజల వినియోగమే ఉత్పత్తి, ఉపాధి, ప్రభుత్వ ఆదాయానికి పునాదిగా నిలుస్తుందన్నారు. బాధ్యతాయుత వినియోగదారులు ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయగలరని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం, పర్యావరణ హితమైన వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఏదైనా లోపం లేదా మోసం జరిగితే వెనుకాడకుండా పరిష్కార వేదికలను ఆశ్రయించాలని సూచించారు. జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 14404 లేదా 1915 ద్వారా, అలాగే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన వినియోగదారుల కమిషన్ల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

# త్వరలోనే సినిమా టికెట్ రేట్లకు ఒకే జీవో ఉండేలా నిర్ణయం

- మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి/పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో సినిమా టికెట్ ధరల విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ, అన్ని సినిమాలకు వర్తించేలా ఒకే సమగ్ర జీవోను తీసుకురావాలని భావిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం సచివాలయంలో జరిగిన సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణ కమిటీ సమీక్షా సమావేశం అనంతరం మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమా బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానం కింద టికెట్ ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సినిమా పరిశ్రమ మనుగడ సాగించడంతో పాటు, సామాన్య ప్రేక్షకుడిపై భారం పడకుండా సమతుల్యత పాటిస్తామని, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. పెద్ద బడ్జెట్ సినిమా, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్ పై చర్చించి ఒక నిర్ణయానికి వస్తామన్నారు. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్ల ధరలు పెంచే విధానం పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సినీ పరిశ్రమ సమస్యలు కూడా విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు సినిమా పాన్ ఇండియా దాటి పాన్ వరల్డ్ అయిందని అన్నారు. పాన్ ఇండియా సినిమా వల్ల నిర్మాతలకు బడ్జెట్ విపరీతంగా పెరుగుతోందన్నారు.

# 26న కృత్రిమ అవయవాల గుర్తింపు శిబిరం

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** జిల్లా దివ్యాంగల పునరావాస కేంద్రం నిర్వహణా సంస్థ అయిన ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం సామర్లకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగల కోసం అవసరమైన కృత్రిమ పరికరాలు కొరకు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపిడివో కెహిమ మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూనిఈ శిబిరంలో ప్రధానంగాని ఇప్పటికే దివ్యాంగులు వాడుతున్న పాత కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌కు మరమ్మత్తులు, కొత్త కృత్రిమ అవయవాల కోసం వ్యక్తిగత కొలతలు తీసుకోవడం,నికొత్త కాలిపర్స్ కోసం కొలతలు తీసుకోవడం, వీల్చైర్, ట్రైసైకిల్స్ అవసరమైన వారిదగ్గర నుండి దరఖాస్తులు స్వీకరణ, వినికిడి లోపం కలిగిన వారిని పరీక్షించి హియరింగ్



ఎయిడ్స్ అందించేందుకు గానూ అవసరమైన వారి నుండి దరఖాస్తులు స్వీకరణ చేపట్టానున్నట్టు తెలిపారు. నిఈ శిభిరానికి హాజరు అయ్యే దివ్యాంగలు సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, రేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ,నిరెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలాన్నారు. దీనికిగానూ గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని అర్హులైన దివ్యాంగలను గుర్తించి,వారికి ఈశిబిరం వివరాలు తెలియజేసి, ఈనెల 26న జరిగే శిబిరానికి హాజరయ్యేలా ప్రోత్సహించి, అవసరమైన సహకారం అందించాలని ఆమె ఆదేశించారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి మండల పరిధిలోని ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఎంపిడివో హిమ మహేశ్వరి తెలిపారు.

## రైతులకు రైతు యూరియా కార్డులు అందజేసిన కరెడ్ల గోవిందు



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కొవ్వూరు మరియు తూరంగి రైతులకు యూరియా ఎరువులకు సంబంధించి గవర్నమెంట్ మరియు వ్యవసాయ శాఖ జారీ చేసిన కార్డుల పంపిణీ కార్యక్రమానికి కొవ్వూరు రైతు సేవా కేంద్రంలో గ్రామ ప్రెసిడెంట్ పిల్లి చక్రారావు అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ మండల జనసేన పార్టీ అధ్యక్షులు కరెడ్ల గోవిందు ఆధ్వర్యంలో తూరంగి 242 కార్డులు, కొవ్వూరు 420, మొత్తం 662 కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్డుల వల్ల రైతులు రైతు భరోసా కేంద్రాలలో, సొసైటీలలో మరియు ఎరువుల షాపుల నందు యూరియా తీసుకొనవచ్చునని తెలియజేశారు. ఈ సందర్భంగా కొవ్వూరు, తూరంగి రైతులు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నీటి సంఘం అధ్యక్షులు సింగం బాబ్జి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ముమ్మిడి వెంకటరావు, తూరంగి జనసేన మాజీ ఎంపీటీసీ పితాని వెంకట రాము, ఏడి. దుర్గా లక్ష్మి, బీసీఎల్. ఏడి ప్రశాంతి, ఏవో సత్యనారాయణ, వి.ఏ.ఏ.వెంకటరమణ, రైతులు మేర్నడి దొరబాబు, ఊబా భద్రం, పిల్లి సూర్యప్రకాష్, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

## 100 రోజుల యాక్షన్ ప్లాన్ పరిశీలన



**సామర్లకోట మేజర్ న్యూస్ :** స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హై స్కూల్ నందు బుధవారం స్పెషల్ ఆఫీసర్ డి. శ్రీకాంత్ బాబు పదవ తరగతి 100 రోజుల యాక్షన్ ప్లాన్ పరిశీలించడం జరిగింది. పదవ తరగతి యాక్షన్ ప్లాన్, స్లిప్ టెస్ట్, మార్నింగ్ క్లాసెస్, లీప్ యాప్లో మార్పులు ఎంటర్ చేసే విధానము చూసి సంతృప్తిని వ్యక్తం చేసారు. ఇదేవిధంగా పనిచేస్తూ టెన్త్ క్లాస్‌లో మంచి రిజల్ట్స్ సాధించాలని విద్యార్థినీ విద్యార్థులకు తగు సూచనలు సలహాలు ఇచ్చిరి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి జె శేషసాయి, ఏ ఎల్ వి కుమారి, యు నాగమణి, ఎస్ రామలక్ష్మి, రాజవరహాలు, కాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్:** గ్రామాలలో త్రాగునీరు, పారి శుద్యంపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం జరుగు తుందని, తదను గుణంగా పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ తెలిపారు. బుధ వారం మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాలలో డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డితో కలసి, ఎంపిడిఓ సూర్య నారాయణ ఆయా గ్రామాలలోని త్రాగునీరు, పారిశుద్య సేకరణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిలో భాగ ంగా జె.తిమ్మాపురంలో ఎస్.డబ్ల్యూ.పి. షెడ్‌ను పరిశీలించారు. అనంతరం కట్టమూరు గ్రామంలో వారు పర్యటిస్తూ గ్రామంలో మహిళలు, వినతి మేరకు డ్రైనేజి ఏర్పాట్లను పరిశీలించి, దానికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించి, మ్యాజిక్ డ్రైను ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఎపిఓ దేగల సుధీర్, జెఇ సతీష్ కుమార్, తదితరులు ఉన్నారు.

# తునిలో జనసేన ప్రభంజనం - భారీగా చేరికలు

- తుని గడ్డపై ఎగురుతున్న జనసేన జెండా
- పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై భారీగా వీర మహిళల చేరిక



**తుని,మేజర్‌న్యూస్** : తుని నియోజకవర్గంలో జనసేన పార్టీ అత్యంత వేగంగా బలోపేతమవుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ నిబద్ధత, ఆయన రాజకీయ ప్రస్థానంలో పాటిస్తున్న విలువలు చూసి క్షేత్రస్థాయిలో ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలోకి తరలివస్తున్నారు. తుని పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచనల మేరకు, రాష్ట్ర ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ బుల్లెట్ వాసు ప్రోత్సాహంతో ఒక ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. వీర మహిళ కసిరెడ్డి దుర్గా రత్నం ఆధ్వర్యంలో తుని పట్టణానికి చెందిన పలువురు మహిళలు జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

–పాల్గొన్న ముఖ్యనేతలు...ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోనం చినబాబు, దండెం రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అద్దేపల్లి బాలాజీ, డైరెక్టర్ బొప్పన రాంబాబు, మగసాల శ్రీనివాస్, జి.నాగబాబు, పెనపాత్రుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

–విశ్లేషణాత్మక కథనం: జనసేన బలోపేతం – తుని నియోజకవర్గంలో మారుతున్న సమీకరణాలు పవన్ కళ్యాణ్ నాయకత్వ వైశిష్ట్యం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త ఒరవడిని సృష్టించిన నాయకుడు పవన్ కళ్యాణ్ కేవలం అధికారం కోసం కాకుండా, సామాజిక మార్పు కోసం ఆయన చేస్తున్న పోరాటం యువతను, మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. "ప్రశ్నించే గొంతుక" నుండి "పరిష్కారం చూపే నాయకుడి" వరకు ఆయన ఎదిగిన తీరు అమోఘం. తునిలో జరుగుతున్న ఈ చేరికలు ఆయన పట్ల ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనం.

–వీర మహిళల పాత్ర – పార్టీకి వెన్నెముక..జనసేన పార్టీలో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ మహిళలకు ఇచ్చే ప్రాధాన్యత మరే ఇతర పార్టీలోనూ కనిపించదు. తునిలో వీర మహిళలు స్వచ్ఛందంగా పార్టీలోకి రావడం అనేది రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి బలమైన పునాది. మహిళా సాధికారత కోసం పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో మహిళల్లో భరోసాని నింపుతున్నాయి.

–తునిలో వ్యూహాత్మక అడుగులు..తుని నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దిశానిర్దేశంలో, రాష్ట్ర ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ బుల్లెట్ వాసుతోపాటు నాయకులు ప్రజల సమస్యలపై పోరాడుతూ పార్టీని ప్రతి ఇంటికీ తీసుకెళ్తున్నారు.

నేటి చేరికలు కేవలం సంఖ్యకు సంబంధించినవి కావు, ఇది ఒక రాజకీయ నిశ్శబ్ద విప్లవానికి సంకేతం.

# కష్టజీవుల వెన్నంటే ఎర్రజెండా

- సిపిఐ నేతలు డేగా ప్రభాకర్,మన్నవ కృష్ణచైతన్య



**ఏలూరు,మేజర్ న్యూస్** : కష్టజీవుల వెన్నంటే ఎర్రజెండా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ర్యాలీని డేగా ప్రభాకర్,జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నుండి పవర్ పేట,గన్ బజార్,ఫ్లై ఓవర్, పాత బస్టాండ్, బిర్లా భవన్, మెయిన్ బజార్, హెడ్ పోస్ట్ ఆఫీస్, ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ పార్క్, ఆర్ఆర్ పేట మీదుగా సిపిఐ ఆఫీసుకు చేరుకుంది.ఈ బైక్ ర్యాలీని ఉద్దేశించి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కోసం నాడు ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్నారని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాడిందని ఈ సందర్భంగా అనేకమంది జైళ్ళ పాలయ్యారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం చేసే దిశగా ప్రజలతోపాటు కార్మిక,కర్షక,విద్యార్థి యువజన సంఘాలకు పోరాటాలు నేర్పింది సిపిఐ అని అన్నారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశంలోని సంపద ప్రజలకు చెందాలనే ఉద్దేశంతో సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఎంతోమంది కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మతోన్మాదం జరిగిందని, రాజ్యాంగ మార్పునకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు.ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అగ్ర భాగాన నిలబడి అనేక పోరాటాలలో త్యాగాలు చేసి అమరులైన చరిత్ర సిపిఐకి ఉందన్నారు.

ఈ బైక్ ర్యాలీలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,ఏరియా సహాయ కార్యదర్శి కూరెళ్ళ వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి ఇందిరా, ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, గొర్లి స్వాతి,శాయిన అభిలాష్ కుమార్, కొండేటి రాంబాబు, మల్ల కనకదుర్గారావు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్,శాస్త్రి,కుమార్, ప్రసాద్, దుర్గారావు, సురేష్, లీలా ప్రసాద్, జానకిరామ్, ఆర్టీసీ ఆదినారాయణ, మెకానికల్ శాఖ సభ్యులు ఉప్పులూరి కేశవరావు, అమర్, బేతా శంకర్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలపై బాలికలకు అవగాహన



**పెరవలి,మేజర్‌న్యూస్** : బాల్యవివాహాలపై బాలికలకు అవగాహన తప్పనిసరి అని సిడిపిఓ ఆశ రోహిణి అన్నారు.డిసెంబర్ 24వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం పిట్టలవేమవరం గ్రామంలో హైస్కూల్ లో జరిగిన కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం పిట్టల వేమవరం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి హసీనా,సిడిపిఓ ఆశరోహిణి ఆదేశాల మేరకు బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం కిషోర్ బాలికలకు బేటి బచావో, బేటి పడావో గురించి వివరించడం జరిగినది.బాల్యవివాహ ముక్తభారత్ కార్యక్రమం 100డేస్ ప్రోగ్రాం నిర్వహించడం అన్ని సచివాలయాల్లో,హైస్కూల్స్‌లో అవగాహన కల్పించడం జరుగుతుందని బాల్యవివాహాలు జరగకుండా కృషి చేయాలని సిడిపిఓ ఆశరోహిణి అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ షేక్ హసీనా అంగన్వాడీలు ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఎంపీల ఆధ్వర్యంలో ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు



**పెరవలి, మేజర్ న్యూస్** : పెరవలి మండలం పియంపి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 23 వ తేదీ మంగళవారం జి వి నాగేశ్వరరావు హార్ట్ స్పెషలిస్ట్ రమేష్ హాస్పిటల్ విజయవాడ వారిచే విజ్ఞాన తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా నాగేశ్వర్రావు వైద్య సలహాలు చూచనలు ఇచ్చారు. ప్రతీ బుధవారం తణుకు సుదా హాస్పిటల్‌లో వైద్యాసేవలు అందించేందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఎయస్‌వి.కృష్ణారావు, పెరవలి మండలం అధ్యక్షులు నక్కా శేఖర్, ప్రధాన కార్యదర్శి షేక్ బాబ్జి, కోశాధికారి కొన నాగబాబు, పిఎంపి సభ్యులు పాల్గొన్నారు.

## కులమాతాలకు అతీతంగా యూవిఆర్ ట్రేడింగ్ కంపెనీ క్యాలెండర్

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్** : కులమతాలకు అతీతంగా లౌకిక వాదాన్ని అనుసరిస్తున్న యు వి ఆర్ రీడింగ్ కంపెనీ యాజమాన్యం అభినందించదగ్గదని ప్రముఖ వైద్యులు విజయబాబు అన్నారు. బుధవారం ఏలేశ్వరంలో ఎండి ఉమ్మడి వెంకట్రావు నూతన సంవత్సరం క్యాలెండర్‌ను డాక్టర్ విజయబాబు విజయ విజయ నర్సింగ్ హోమ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ ఉమ్మడి వెంకట్రావు యు వి ఆర్ ట్రేడింగ్ కంపెనీ నెలకొల్పి ఉపాధి కల్పించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుల మతాల ప్రమేయం లేకుండా అన్ని మతాలను గౌరవిస్తూ ఏసుక్రీస్తు క్యాలెండర్‌ను ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ నర్సింగ్ హోమ్ సిబ్బందితో పాటు న్యూ ఇయర్ ట్రేడింగ్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బీర.సత్యకు మొదటి బహుమతి



ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు.నిజాతీయ వినియోగదారుల దినోత్సవం 2025 ను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన వక్తృత్వ పోటీలలో (తెలుగు ఇంగ్లిష్) విజేతలకు స్థానిక ఎస్కేవిటి పాఠశాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఇతర ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వంచారు.ని2025 జాతీయ వినియోగదారుల దినోత్సవం ఇతివృత్తంగా "డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం" ను ఎంపిక చేశారు. ఇంగ్లీష్ మీడియంలో బి.సత్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల,ధవళేశ్వరం) ప్రథమ బహుమతి 5000 రూపాయలు పారితోషకం అందించడం జరిగింది. ఈ అవార్డు రావడం పట్ల విద్యార్థిని బీర సత్యా మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని నన్ను ప్రోత్సహించిన తల్లితండ్రులకు అదే విధంగా కళాశాల అధ్యాపకులకు ధన్యవాదములు తెలియజేసింది.

